ప్రజాశక్తి
ఆదివారం 22 జూన్ 2025
5
విజయనగరం



హైకోర్టు జడ్జిలను మర్యాద పూర్వకంగా కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి- విజయనగరం లీగల్

రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తులు, జిల్లా పోర్టు పోలియో జడ్జి చీమలపాటి రవి, ఇతర హైకోర్టు న్యాయమూర్తులు బివిఎల్ఎన్ చక్రవర్తి, ఎవి శేష సాయిలను శనివారం కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తులకు కలెక్టర్ పుష్పగుచ్చాలు అందజేశారు.



జిల్లా పోర్టుపోలియో జడ్జి చీమలపాటి రవికి పుష్పగుచ్చం అందజేస్తున్న కలెక్టర్

సం'క్షామ' వసతి గృహాలు

వసతి గృహాల్లో ఉండి విద్యనభ్యశించాలని ఎంతో ఆశతో ఉన్న పేద విద్యార్థులను సంక్షేమ వసతి గృహాలు వెక్కిరిస్తున్నాయి. జిల్లాలోని చాలా వసతిగృహాలకు సరైన భవనాలు లేక, సౌకర్యాలు లేక వసతి గృహల్లో ప్రవేశాలు సైతం తగ్గిపోయాయి. మరోవైపు శిథిలావస్థకు చేరుకున్న వసతిగృహాల్లో ఉండలేక విద్యార్థులు పాఠశాలల్లో చదువుకు స్వస్తి పలికే పరిస్థితి నెలకొంది. ఫలితంగా విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టడంతో ఉపాధ్యాయ పోస్టుల్లోనూ కోత పడుతోంది. అధికారంలోకి ఎవరొచ్చినా. వసతి గృహాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా వసతి గృహాలను పట్టించుకోలేదు.



కనీస వసతులు లేని దాసన్నపేటలోని వసతిగృహం

- శిథిలావస్థలో భవనాలు.. మౌలిక వసతుల లేమి
- ఖాళీ అవుతున్న హాస్టళ్లు
- చదువుకు దూరమవుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో బిసి, ఎస్సి, ఎస్టి సంక్షేమ వసతిగృహాలు 84 వరకు ఉన్నాయి. వీటిల్లో 9,400 మంది విద్యార్థులు ఉండేందుకు అవకాశం ఉంది. అయితే సరైన మౌలిక వసతులు లేకపోవడంతో అందులో సగం మంది కూడా విద్యార్థులు లేరు. అరకొర వసతుల నడుమ వీరు ఇన్నేళ్లూ చదువులు సాగించారు. పాఠశాల విద్యతో పాటు 6 నుంచి పది చదువుతున్నవారు, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర కోర్సులు పూర్తయిన వారిలో కొందరు ఇళ్లకు వెళ్లిపోయారు. సరైన భవనాలు లేక, సౌకర్యాలు లేక హాస్టళ్లలో చేరుతున్న విద్యార్థులు సంఖ్య ప్రతి ఏటా తగ్గిపోతోంది. భోగాపురం మండల కేంద్రంలోని బిసి హాస్టల్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉండడంతో విద్యార్థులు అందులో ఉండేందుకు అవకాశం లేకుండాపోయింది. ఫలితంగా వీరంతా స్థానిక జెడ్పి హైస్కూలులో చదువు మానేసి కొందరు ఇతర పాఠశాలల్లో చేరగా, మరికొందరు పూర్తిగా చదువు మానేశారు.

అధ్వాన స్థితిలో..

చాలా వసతిగృహాలకు తలుపులు, కిటికీలు సక్రమంగా లేవు. దోమ తెరలు, దుప్పట్లు, పరుపులు, మంచాలు ఇవ్వలేదు. భవనాలకు సంబంధించి చిన్నపాటి మరమ్మ తులు కూడా చేయలేదు. ప్రస్తుతం భవనాలన్నీ ఆధ్వాన స్థితిలో దర్శనమిస్తున్నాయి. కొన్ని కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. తరలించాల్సి ఉన్నా ఆర్థికభారంతో అధికారులు ముందడుగు వేయడం లేదు. విజయనగరం బిసి వసతి గృహంలో 102 మంది విద్యార్థులు ఉంటే వారికి కేవలం ఆరు మరుగుదొడ్లు ఉన్నాయి. ఉన్న మరుగుదొడ్లు తలుపులు లేవు. మరుగుదొడ్లు లోపలికి వెళ్లాలంటే కంపు కొడుతున్నాయి. గోడలు పెచ్చులుడి, ఇరుకైన గదులు, చీకటి గదుల్లో ఉంటున్న దయనీయమైన పరిస్థితి నెలకొంది.



ఎస్సి బాలుర కళాశాల వసతిగృహంలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

కార్యరూపం దాల్చని ప్రతిపాదనలు

జిల్లాలో వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న వసతిగృహాల్లో విద్యార్థులకు వసతుల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సంక్షేమ శాఖల అధికారులను కొద్ది నెలలు క్రితం ఆదేశించారు. బిసి, ఎస్ సి, ఎస్ టి సంక్షేమ శాఖల పరిధిలోని హాస్టళ్లలో వసతుల కల్పనకు అవసరమైన నిధుల కోసం ఆయా ప్రభుత్వ శాఖలకు నివేదించాలన్నారు. జిల్లాలో 51 బిసి సంక్షేమ వసతి గహాలకు గాను 32 హాస్టళ్లకు సొంత భవనాలు వున్నాయని, 19 హాస్టళ్లకు భవనాలు నిర్మించాల్సి వుందని బిసి సంక్షేమ శాఖ అధికారి నివేదించారు. జిల్లాలో ప్రస్తుతం సొంత భవనాలు వున్న 32 బిసి సంక్షేమ వసతిగహాలకు మరమ్మత్తులు చేపట్టేందుకు రూ.1.06 కోట్లతో ప్రతిపాదించారు. సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించి మొత్తం 30 హాస్టళ్లకు గాను 23 హాస్టళ్లకు సొంత భవనాలు ఉన్నాయి. కేంద్ర పథకం పిఎం అజయ్ కింద ఒక్కొక్కటి రూ.3 కోట్ల వ్యయంతో 6 హాస్టల్ భవనాల నిర్మాణానికి కలెక్టర్ ప్రతిపాదనలు చేశారు. 23 హాస్టళ్ల మరమ్మత్తులకు రూ.1.09కోట్లతో ప్రతిపాదించారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని 3 హాస్టళ్ల మరమ్మత్తులకు రూ.33 లక్షలతో ప్రతిపాదనలు చేశారు. మహారాణిపేట పోస్ట్ మెట్రిక్ బాలికల వసతిగహాన్ని రూ.4 కోట్లతో నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు. కానీ ఎక్కడా పనులు ప్రారంభం కాలేదు.

యోగాతో ఆరోగ్యం : కలెక్టర్

• రాజీవ్ క్రీడా మైదానంలో 5 వేల మందితో యోగాసనాలు • జిల్లా అంతటా వేడుకలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

యోగ సాధన ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, యోగా తోనే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలిపారు. అంతర్జాతీయ యోగాడే సందర్భంగా స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో 5 వేల మందితో యోగా ప్రదర్శనలు చేసారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ నెల రోజుల పాటు జిల్లాలో యోగంధ్ర లో భాగంగా అనేక కార్యక్రమాలను నిర్వహించామని, ప్రజలు , జిల్లా అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేసినందుకు ధన్యవదాలు తెలిపారు. జిల్లా నుండి విశాఖ లో జరిగే యోగ కార్యక్రమానికి 31 వేల మందిని పంపినట్లు తెలిపారు. అంతర్జాతీయ యోగా డే సందర్భంగా జిల్లాలో 5775 వేదికలుగా సుమారు 9లక్షల మంది యోగ సాధకులతో యోగా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాల్లో యోగా కార్యక్రమాల్లో వందలాది మంది పాల్గొన్నారని తెలిపారు.

యోగా ఆవశ్యకతను చెప్పేలా స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ

ప్రతి నెలా 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛంధ్ర - స్వర్ణాంధ్ర లో భాగంగా నిర్వహించే కార్యక్రమాన్ని ఈ వారం యోగా డే సందర్భంగా యోగాంధ్ర అభివృద్ధి కోసం ప్రతి రోజు సమయం కేటాయిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని ఆరోగ్య పధంలో నడిపేందుకు యోగా సహాయం చేస్తుందని నమ్ముతూ , నా తోటి వారికి కూడా యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తానని ప్రతి ఒక్కరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, ఆర్‌డిఒ సవరమ్మ, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, సిపిఒ బాలాజీ, జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, డ్వామా పీడీ శారదాదేవి, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, డిప్యూటీ కలెక్టర్ ప్రమీల గాంధీ, హౌసింగ్ పీడీ మురళీ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ జీవన రాణి, జిల్లా పర్యాటక అధికారి కుమార స్వామి, ఆయుష్ అధికారి ఆనందరావు, ఐసిడిఎస్ పీడీ విమల, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత, మెప్మా పీడీ చిట్టి రాజు, సచివాలయ నోడల్ అధికారి రోజారాణి, డిఎస్‌డిఒ, యోగా శిక్షకులు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న కలెక్టర్, అధికారులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, క్రీడాకారులు, విద్యార్థులు

యోగా దినోత్సవంలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు

రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జిల్లా న్యాయశాఖ, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు పోర్ట్ పోలియో జడ్జి (విజయనగరం) చీమలపాటి రవి, ఇతర హైకోర్టు న్యాయమూర్తులు బివిఎల్ఎన్ చక్రవర్తి, ఎవి శేష సాయి పాల్గొన్నారు. హైకోర్టు న్యాయమూర్తి చీమలపాటి రవి మాట్లాడుతూ యోగా మన దైనందిన జీవితంలో దినచర్యగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. బబిత, న్యాయమూర్తులు, న్యాయవాదులు. కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియంలో యోగాలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు

బిజెపి ఎమ్మెల్యేపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

సిపిఎం నగర కార్యదర్శి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కర్నూలుజిల్లా అధోనిలో దళిత సర్పంచ్‌ను అవమానించిన బిజెపి ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. అధోనిలో బిజెపి ఎమ్మెల్యే ఒక అధికారిక కార్యక్రమంలో దళిత సర్పంచ్ చంద్రశేఖర్ ను స్టేజ్ పైకి పిలవకుండా, తన కాళ్ల వద్ద నిలబెట్టి అవమానించడం దారుణమని పేర్కొన్నారు. కావున ఆయనపై పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు సర్పంచ్ ఎస్సీ వాడని తన కాళ్ల దగ్గర కూర్చోమనడం దుర్మార్గమని అన్నారు. మనువాద సిద్ధాంతం కలిగిన బిజెపి ఎమ్మెల్యే రాజ్యాంగబద్ధంగా ప్రమాణం చేసి కుల వివక్ష చూపాడని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వం స్పందించి అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విజయనగరం భారీ స్కోర్

శ్రీరామ్ సచిన్ 152 పరుగులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విజ్జి క్రికెట్ మైదానంలో శనివారం నుంచి ప్రారంభమైన అంతర్ జిల్లాల మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో విజయనగరం జట్టు భారీ స్కోర్ సాధించింది. విజయ నగరం జట్టు మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రీరామ్ సచిన్ అద్భుతంగా ఆడి 80 బంతుల్లో 152 పరుగులు సాధించడంతో తొలిరోజే విజయనగరం 411 పరుగుల భారీ స్కోర్ సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విజయనగరం జట్టు తొలి రోజు 83.5 ఓవర్లలో 411 పరుగులకు ఆల్ అవుట్ అయ్యింది. టాప్ ఆర్డర్ బ్యాటర్ లోహిత్ రెడ్డి (91 పరుగులు), కార్తికేయ (63 పరుగులు) అర్ధ సెంచరీలతో రాణించారు. ఆట ముగిసే సమయానికి శ్రీకాకుళం జట్టు నాలుగు ఓవర్లు వికెట్ నష్టపోకుండా ఐదు పరుగులు సాధించింది. వేగంగా ఆడి సెంచరీ సాధించిన శ్రీరామ్ సచిన్‌ను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామరాజు, ట్రెజరర్ పిఎస్ఎన్ వర్మ, సెలెక్టర్ సర్ఫరాజ్ అభినందించారు.

వసతిగృహ నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ అణగారిన పిల్లల వసతి గృహం (నేతాజీ సుభాష్ చంద్ర బోస్ అవస్య విద్యాలయం) కు అర్హత గల ఎన్‌జిఒలు ఈనెల 30లోగా సమగ్ర శిక్షకార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సర్వశిక్ష ఎపిసి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌జిఒలుగా ప్రభుత్వ అనుమతితో రిజిస్ట్రేషన్ లేదా గుర్తింపు పొందిఉండాలని, ఎన్‌జిఒ సొసైటీ రిజిస్ట్రేషన్ వివరాలు, మూడేళ్ల ఐటి రిటర్న్స్‌తో పాటు రిజిస్ట్రేషన్ పత్రాల నఖలు, స్వచ్ఛంద యొక్క నియమాలు, నిబంధనలను తెలిపే ధ్రువీకరణ కాపీలు , రిజిస్టర్ కాబడిన ప్రదేశం /పనిచేసే ప్రదేశాన్ని తెలిపే పత్రాలు. సంస్థ వివరాలను తెలిపే పత్రాలు దరఖాస్తుతో పాటు అందజేయాలని పేర్కొన్నారు. ఒప్పందం పత్రం, సంస్థ సిబ్బంది వివరాలు, గత మూడేళ్ల ఆడిట్ రిపోర్టులు, సంస్థ బ్యాంకు పాస్‌బుక్, సంస్థలో ఉన్న కమిటీ/కార్యవర్గ సభ్యుల వివరాలతో పాటు వారి చిరునామా, ఫోన్ నంబర్లు తెలియజేయాలని పేర్కొన్నారు.

యోగా పేరుతో సమస్యలు పక్కదారి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రజలు వ్యక్తిగతంగా ఆచరించాల్సిన ఒక కార్యాచరణ అయిన యోగాను ప్రభుత్వ కార్యక్రమంగా మార్చి కోట్లాది రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ విమర్శించారు. యోగా పేరుతో సమస్యలు పక్కదారి పట్టాయని అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన మీడియా సమావేశం లో ఆమె మాట్లాడుతూ గత రెండు నెలలుగా యోగా ని ప్రమోట్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పడుతున్న తాపత్రయం ఆశ్చర్యం కలిగిస్తున్నదని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల జీవనాడి అయిన విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రద్దు చేసే విధంగా కూటమి నాయకులు మోడీని ఒప్పించే ప్రయత్నం చేయకుండా, మోడీని ప్రసన్నం చేసుకునేందుకు యోగాను సాధనంగా చేసుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మోడీ పాల్గొనే ఈ యోగా కార్యక్రమ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు 3 వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని విమర్శించారు. వేలాది ఆర్టీసీ బస్సులను ఈ కార్యక్రమానికి మళ్లించడం వలన ప్రజలు రవాణా సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. మోడీని ప్రసన్నం చేసుకునేందుకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చేస్తున్న తపన తప్ప దీనిలో ఎలాంటి ప్రజా ప్రయోజనం లేదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడేందుకు ధృఢ సంకల్పంతో కృషి చేయాలని డిమాండ్ చేశారు.

తూతూ మంత్రంగా రీ సర్వే

రైతుల విన్నపాలను పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వే గత వైసిపి ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే కంటే ఘోరంగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. వైసిపి హయాంలో చేపట్టిన భూముల సర్వే తప్పుల తడకలుగా ఉందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో రీ సర్వే చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా విజయనగరం మండలంలో మొదటగా మలిచర్ల, సుంకరి పేట, రాకోడు, గుంకలాం గ్రామాల్లో మొదటిదఫాగా రీ సర్వే చేయాలని భావించారు. అందులో భాగంగా విజయనగరం మండలం సుంకరి పేట, మలిచర్ల గుంకాలం ,రాకొడు గ్రామంలో రీ సర్వే చేపట్టేందుకు విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు గత ఏడాది డిసంబర్ లో ప్రారంభించారు. అంత వరకు బాగానే ఉన్నప్పటికీ సర్వే నత్తనడకనసాగుతోంది.అంతేకాకుండా తాజాగా అధికారులు చేపట్టిన సర్వే కూడా తప్పుల తడకలతో ఉందని రైతులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వే కంటే అద్వాన్నంగా ఉందని రైతులు అంటున్నారు. రెవెన్యూ అధికారులు గ్రామాల్లో రైతులను అడిగి ఆ హద్దులను నిర్ణయించేవారని రైతులు అంటున్నారు. డ్రోన్ ద్వారా రెవెన్యూ అధికారులు రీ సర్వే చేయడంతో హద్దుల్లో తేడాలు వస్తున్నాయని అంటున్నారు. రైతులు గతంలో పురోణి మీద, గ్రామ పంచాయతీలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూములను రీ సర్వే చేసి రైతులకు వారి పేరున చేయాలని విన్నవించినా పట్టించుకోపోవడం, తాతల పేరు మీద ఉన్న భూములను అందుకు సంబంధించిన వారు అఫిడవిట్‌లు ఇచ్చినప్పటికీ వారి కుమారుల పేరు మీద పట్టాదారు పాస్ పుస్తకాల్లో మార్పు చేయడం లేదని ఆవేదన చెందుతున్నారు. తండ్రి పేరున ఉన్న భూమిలో పొరపాటున తండ్రి స్థానంలో ఉండాల్సిన పేరులో తప్పులున్నా మార్చడం లేదంటున్నారు. గత ప్రభుత్వం లో రీ సర్వే చేసి హద్దులకు సైతం రాళ్లు వేసి ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అది కూడా చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వివాదాలు లేని వాటిని సరి చేస్తున్నాం

రీ సర్వే చేసి గ్రామాల్లో వివాదాలు లేని భూములను సరి చేస్తున్నాం. తండ్రి పేరు మీద ఉన్న భూములకు సంబంధించి కుమారుల అఫడవిట్‌లు అందిస్తే సరి చేస్తాం. హద్దు రాళ్ళు సర్వే పూర్తి అయినా తర్వాత అందిస్తాం.

కూర్మనాధరావు, తహశీల్దార్, విజయనగరం



బస్సులు లేకపోవడంతో ఖాళీగా ఉన్న ఆర్‌టిసి కాంప్లెక్సు

రెండోరోజూ తప్పని పాట్లు

- బస్సులు లేక ఖాళీగా దర్శనమిచ్చిన కాంప్లెక్సు
- ప్రయివేటు వాహనాలను ఆశ్రయించిన ప్రయాణికులు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్నట్లు విశాఖలో యోగాడే వల్ల జిల్లాలో ప్రయాణికుల ఇబ్బందులు తప్పలేదు. బస్సులన్నీ విశాఖపట్నం తరలించడంతో వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు సాగించే ప్రజలు ఆర్‌టిసి బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం జరిగిన యోగాకు శుక్రవారమే బస్సులు తరలించడంతో కాంప్లెక్సు ఖాళీగా దర్శనమిచ్చింది. జిల్లాలో ఐదు డిపోల్లో 310 బస్సులు ఉండగా విశాఖలో జరిగే యోగాకు 260 బస్సులను కేటాయించారు. జిల్లాలో 50బస్సులను తిప్పినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ అవి కూడా ఎక్కడా కనిపించలేదని ప్రయాణికులు అంటున్నారు. ప్రయాణికులు గంటల తరబడి వేచి చూసినా బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. దీంతో ఆటోలను ఆశ్రయించారు.

నెల రోజులు 'యోగా'ర్పణం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గతనెల 21న చేపట్టిన యోగా ప్రచారపర్వం శనివారంతో ముగిసింది. మోడీని ప్రసన్నం చేసుకునేందుకు జనాన్ని వాడుకోవాలన్న కూటమి ప్రభుత్వ వ్యూహం నెరవేరింది. ఇందుకోసం అధికారులు మొదలుకుని, చిరుద్యోగుల వరకు ఎంతో శ్రమించారు. శిబిరాలు, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. బదిలీల్లో రాజకీయ సిఫార్సులను పక్కన బెట్టినందుకు ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు ఒకానొక సందర్భాల్లో అలకబూనినప్పటికీ అధికారుల పగడ్బందీ ప్రణాళిక వల్ల దారికి రాక తప్పలేదు. విశాఖ సముద్రతీరంలో శనివారం నిర్వహించిన యోగా డే కార్యక్రమానికి జిల్లా నుంచి 750 బస్సుల్లో జనాన్ని తరలించారు. అనుకున్న ప్రకారం జనాన్ని తరలించినప్పటికీ, వారిలో యోగా చేసిన వారు అంతంత మాత్రమే. ఈ సందర్భంగా బస్సులన్నీ యోగా డే నిర్వహణకు తరలించడంతో జనం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నెల రోజులుగా అధికార యంత్రాంగాన్ని ఇదే పనిలో పెట్టడం వల్ల జనం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సమస్యలన్నీ పక్కదారిపట్టాయి. చివరిరోజు హంగామా పట్ల విమర్శలు వెల్లువిరుస్తున్నాయి. 'మోడీ వస్తే మాత్రం ఇంతమంది జనాలను తరలించడం, నెలరోజుల పాటు ఇతర పనులను పక్కనబెట్టడం' అవసరమా? స్కూళ్లకు కూడా సెలవులు ఇచ్చేశారు? అంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పబ్లిక్ టాక్ వినిపించింది. గడిచిన వారం రోజుల్లో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు వచ్చి యోగా డేకు ప్రజల్ని తరలించడానికి సమీక్షలు పెట్టుకున్నారే తప్ప,



ఆయా శాఖల వారిగా జనం ఎదుర్కొంటున్న సమస్యలపై మాత్రం ఏమాత్రం చర్చించలేదనే విమర్శలు తారా స్థాయికి చేరాయి. నోరు విప్పితే రాష్ట్రం అప్పుల్లో ఉందని, అప్పులు కూడా పుట్టడం లేదంటున్న ప్రభుత్వం యోగా పేరిట రూ.కోట్లు ఖర్చు చేయడానికి ఎలా వచ్చాయంటూ జనం నుంచి తీవ్ర అసహనం వ్యక్తమౌతోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువతీ యువకులు అల్లాడిపోతుంటే యోగా చేసుకుంటే మానసిక ప్రశాంతత పొందవచ్చంటూ ప్రచారం చేయడం ప్రజల్ని తప్పుదారి పట్టించడమేనన్న వారూ లేకపోలేదు. వాస్తవానికి మన జిల్లాలో పేద కుటుంబాలే అధికం. తినడానికి తిండి కూడా లేనివారెందరో. తినడానికి తిండిలేక జనం అల్లల్లాడిపోతుంటే.... తిన్నది అరిగించుకోమన్నట్టు యోగా డేకు తరలించారు. మింగ మెతుకు లేకపోయినా మీసానికి సెంపంగి నూనె రాసుకుని మరీ రమ్మన్నట్టుగా రోజువారీ కూలి పని వదులుకుని మరీ యోగాకు రావల్సిందేనంటూ పట్టుబట్టారట. డ్వాక్రా మహిళల్ని బెదిరించి, ఉపాధి హామీ కూలీలను మభ్యపెట్టి తీసుకెళ్లడం గొప్పవిషయమేమీ కాదని కూడా చాలా మంది నోట వినిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గడిచిన ఏడాదిలే చేసిందేమీ లేక జనాన్ని ఈ రకంగా మభ్యపెట్టి నెలరోజులపాటు కాలక్షేపం చేశాయని, లేదంటే యోగాడే ఘనంగా నిర్వహించడం, యోగా నిర్వహణకు గ్రామాలు, పట్టణాల్లో తగిన సదుపాయాలు కల్పించడం ద్వారా చిత్తశుద్ధి ప్రదర్శించేదని జనం చెప్పుకుంటున్నారు. యోగా డే నిర్వహణ గిన్నిస్ బుక్‌కు ఎక్కించాలన్న తపన వెనుకబడిన ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసేందుకు ఉంటే బాగుండేదని పబ్లిక్ టాక్ వినిపిస్తోంది.



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వరరావు

సెట్విజ్ సిఇఒగా డిఎస్‌డిఒకు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వరరావుకు సెట్విజ్ సిఇఒగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు శనివారం వెంకటేశ్వరరావు సెట్విజ్ సిఇఒగా (ఎఫ్ఎసి) బాధ్యత లు స్వీకరించారు. ఇటు క్రీడలు, యువజన సర్వీసుల శాఖను సమన్వయ పరుచుకుంటూ బాధ్యతలు నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువజన సర్వీసులు, క్రీడ ప్రాధికార సంస్థకు సంబంధించిన ఉద్యోగులు అభినందనలు తెలిపారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సంతకవిటి

కార్మికుల హక్కుల రక్షణ కోసం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా జులై 9న జరుగు సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని సిఐటియు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లు అమలు చేయడం దుర్మార్గమన్నారు. కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలన్నారు. అంగన్వాడి, ఆశా, విఒఎ, పంచాయతీ వర్కర్లు, విఆర్ఎ అందర్నీ పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేసి, సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. అంగన్వాడి, ఆశాలకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు. అనంతరం సమ్మె గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు కె.అశిరప్పడు, యూనియన్ నాయకులు, రాంబాయి, గౌరమ్మ, పద్మ, సుశీల, ఎల్.శివాజీ, వై. ఆనంద్, జి. నారాయణరావు, సూరిడమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్సిని సందర్శించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - దెంకాడ


సిబ్బందితో మాట్లాడుతున్న జీవనరాణి

స్థానిక పిహెచ్సిని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి యస్.జీవన రాణి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఇహెచ్ఆర్, ఆభా ఐడిలు గురించి, పిహెచ్సిలో అందుతున్న నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్ గురించి డాక్టర్ అనుమను అడిగి తెలుసుకున్నారు. పిహెచ్సి పరిసరాలు పరిశీలించి, మెడికల్ ఆఫీసర్కు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యుడిసి దుర్గా రావు, ఫార్మసిస్ట్ అప్పలనాయుడు, పిహెచ్ఎన్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

సిబిఎం పాఠశాల అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాబు పాలూరి, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. సిబిఎం పాఠశాల అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరుతూ శనివారం పాఠశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థలంపై హైకోర్టులో కేసు పెండింగ్లో ఉన్నప్పటికీ కొనుగోలు చేసిన వ్యక్తి స్థలంలో శంకుస్థాపన చేయడం అన్యాయమన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ వెంటనే రద్దు చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. సిబిఎం పాఠశాలను కాపాడుకునేందుకు ముందుకు రావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు రవికుమార్, క్రిస్టియన్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్కు నోటీసు అందిస్తున్న కార్మికులు

ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22 నుంచి సమ్మె చేయనున్నట్లు మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఈశ్వరరావు, తెంటు రవి చెప్పారు. సమ్మె నోటీసును శనివారం మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, చైర్మన్ శరత్కు వేర్వేరుగా అందించారు. ఇంజినీరింగ్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని గతనెల 7 నుంచి సమ్మె చేస్తున్నప్పటికి బొబ్బిలిలో మద్దతు ఇచ్చి నిరసన తెలిపి విధులకు హాజరయ్యామని చెప్పారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెను ఉధృతం చేసేందుకు ఈనెల 22 నుంచి సమ్మెలో పాల్గొంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర రీజనల్ ప్రెసిడెంట్లు వీరే..

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్


ప్రెసిడెంట్లను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఉత్తరాంధ్ర వైసిపి టీచర్స్ అసోసియేషన్ రీజనల్ ప్రెసిడెంట్గా బూడి వెంకట రావు, ఉత్తరాంధ్ర పంచాయతీ రాజ్ అసోసియేషన్ రీజనల్ ప్రెసిడెంట్గా జెడ్పిటిసి గార తౌడును నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ప్రకటించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వీరు పేర్లను ఆయన ప్రకటించి వారికి పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బీమా చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని భరతవాణిపాలెం గ్రామంలో ఉన్న విశాఖ పాల ఉత్పత్తి కేంద్రం వద్ద రెండు పాడి పశువుల రైతులకు శనివారం బీమా చెక్కులను అందించారు. వి రామునాయుడుకు రూ.35వేలు, ఎల్ సన్యాసమ్మకు రూ.40వేలు మంజూరైన చెక్కులను వైస్ సర్పంచ్ కందిపెల్లి పెదనాయుడు, ఎంపిసిఎస్-2 ప్రెసిడెంట్ సిహెచ్ వెంకటరమణ, పాలకేంద్రం సూపర్వైజర్ నాయుడు బాబు, సెక్రటరీ పోతల దేవుడు చేతుల మీదుగా అందజేశారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - వేపాడ


మంచినీటి ట్యాంకును అందిస్తున్న ప్రతినిధులు

వాసవీ క్లబ్ అధ్యక్షుడు పుట్టా ఈశ్వరరావు, కార్యదర్శి ఉద్దగిరి వెంకటరావు, మాదేటి శ్రీను ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ ఎడ్మినిస్ట్రేటీవ్ వైస్ ప్రసిడెంట్ ఎం.రవికుమార్, పోగ్రాం కోఆర్డినేటర్ ఎం.విశ్వేశ్వరావు సమక్షంలో చినగుడిపాలలో ఆవుల షెడ్కు గరుకు స్తంభం, చినగుడిపాల, మారిక ప్రాథమిక పాఠశాలకు 50 పుస్తకాలు, 50 పెన్నులు, బల్లంకిలో రైతుకు యూరియా బస్తా, వేపాడలో చెప్పులు కుట్టే వ్యక్తికి గొడుగు అందచేసి ఇద్దరు వ్యక్తులను సన్మానించారు. ఆనందపురం ఒకేషనల్ కాలేజీకి 1000 లీటర్లు వాటర్ ట్యాంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ రీజనల్ చైర్మన్ వి.నానాజీ, జోన్ చైర్మన్ కొత్త కిషోర్ సీనియర్ సభ్యులు దుడ్డు శ్రీనివాసరావు, ఎస్.ఎన్.వి.సత్యనారాయణ, విజ్జపు సంపత్ కుమార్, విన్నకోట శ్రీను, కూరగంగ కొత్త శ్రీను, దుడ్డు వెంకటేష్, ఎస్.సాయిరాం, ఎస్.అఖిలేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లకు బిల్లుల బెడద

- పల్లె పండగ పనులకు రూ.3.56 కోట్లు బకాయిలు
- అప్పుల పాలవుతున్నామని కాంట్రాక్టర్లు గగ్గోలు
- నైరాశ్యంలో పనులు చేసిన నాయకులు
- బిల్లుల కోసం తప్పని ఎదురుచూపులు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని 39 గ్రామపంచాయతీల్లో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పంచాయతీరాజ్ పరివేక్షణలో పల్లె పండగ పథకం కింద రూ. 5.60 కోట్లు వ్యయంతో గ్రామస్థాయిలో 129 సిసి రోడ్లు నిర్మించారు. ఈ పనులను టిడిపి నాయకులు, సర్పంచులు, ఇతర నాయకులు 2024 డిసెంబర్ నెలలో ప్రారంభించి, సమయానికి పూర్తి చేశారు. అయితే ఇప్పటివరకు కాంట్రాక్టర్లకు రూ. 44 లక్షలు మాత్రమే బిల్లులు చెల్లించారు. మిగిలిన రూ.3.56 కోట్లు బకాయిలు ఇంకా ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. మరో రూ.1.60కోట్లు వరకూ పనులు చేయలేదు. పల్లె పండగ పనులు అప్పులు చేసి సీసీ రోడ్లు వేశామని, ఇంతవరకు బిల్లులు చెల్లించకపోతే తమ పరిస్థితి ఏమిటని పనులు చేసిన బాధిత టిడిపి నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు అప్పులు చేసి వడ్డీలు కట్టలేక, ఇటు పల్లె పండగ పనులు చేసి బిల్లులు కాక నైరాశ్యంలో ఉన్నామని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వెంటనే బిల్లులు వస్తాయనే ఆశతో పనులు చేశాం కానీ ఇప్పటికి ఆరు నెలలు కావస్తున్నా పూర్తి బిల్లులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా ఆరు నెలల్లో గ్రామాల అభివృద్ధి కోసం పల్లె పండగ పేరుతో గ్రామీణ ప్రాంతాలకు సిసి రోడ్ల నిర్మాణాలు చేపట్టాయని సంతోషపడ్డామని, తీరా సిసి రోడ్లు నిర్మించాక బిల్లులు చెల్లించకపోవడం విడ్డూరంగా ఉందని వారంతా వాపోతున్నారు. ఇప్పుడు నమ్మిన దైవం మోసం చేసినట్టైందని ఓ టిడిపి నేత వాపోయారు. సమయానికి చెల్లింపులు జరగకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. ఇప్పుడు ఈ పనులు చేసి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు చెల్లించకుంటే మిగతా ప్రభుత్వ అభివృద్ధి పనులకు ముందుకు రాలేమని వారంతా ఖరాఖండీగా చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి పల్లె పండగ పనులకు మిగిలిన బకాయిలను విడుదల చేసి, కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలని కోరుతున్నారు.


తాటిపాడు రేగిడిలో పల్లె పండగ నిధులతో వేసిన సిసి రోడ్డు

రూ.44 లక్షలు మాత్రమే బిల్లులు అయ్యాయి

మండలంలో పల్లె పండగ పేరుతో 129 పనులకు 5.60 కోట్ల రూపాయలు ప్రతిపాదన పంపించి నిధులు మంజూరయ్యాయి. కానీ ఇంతవరకు రూ.44 లక్షల మాత్రమే బిల్లులు చెల్లింపులు జరిగాయి. మిగతా 3.56 కోట్ల రూపాయలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. 1.60 కోట్ల రూపాయలకు పనులు చేయలేదు. నిధులు మంజూరైన వెంటనే ఆయా కాంట్రాక్టర్ల బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తాం.

రియాజ్, పంచాయతీ రాజ్ జెఇ, రేగిడి

అందని బిల్లు..తమ్ముళ్ల గుండె గుబేలు

పనులు పూర్తిచేసినా చేతికి రాని నిధులు - పలుచోట్ల ఆగిపోయిన నిర్మాణాలు

ప్రజాశక్తి - గుర్ల

పల్లె పండగ.. తెలుగు తమ్ముళ్లకు దండగా..ఇది ప్రస్తుతం మండలంలోని తెలుగు తమ్ముళ్ల మదిలో నలుగుతున్న మాటలు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రం మొత్తం మీద గ్రామ సభలు నిర్వహించి గ్రామాలలో చేయవలసిన అభివృద్ధి పనులను గుర్తించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు పనులను ప్రారంభించారు. వెండర్ కోడ్ను ఉపయోగించి తెలుగుదేశం, జనసేన, బిజెపి కార్యకర్తలకు చాలా చోట్ల పనులు అప్పగించారు. పనులు చేసిన ప్రాప్తికి ఎంబుక్ రికార్డ్ చేసి ప్రతి గురువారం బిల్లులు చెల్లింపులు జరుగుతాయని ప్రభుత్వ పెద్దలు, అధికారులు కార్యకర్తలకు భోరోసా ఇచ్చి పనులు ప్రారంభించారు. రెండు, మూడు వారాలు పాటు బిల్లులు చెల్లింపులు జరగడంతో గ్రామాలలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఆ తరువాత 2025 జనవరి నుండి నేటి వరకు పల్లె పండగ అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు చెల్లుంపులు జరగలేదు. దీంతో పనులు చేపట్టిన కార్యకర్తలు నాయకులను కలిసి నిధులు వస్తాయా? రావా ? ఎప్పుడు వస్తాయని అడిగినా సరైన సమాధానం లేదని తెలుగు తమ్ముళ్లు బాహాటంగా చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం వచ్చి సంవత్సరం కావస్తున్నా 2014-2019 సంవత్సరాలలో చేపట్టిన కొన్ని పనులకు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. గ్రామ స్థాయి నాయకులు నిరాశకు గురైతే పార్టీ వెనుక బడుతుందని కొంతమంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 42 పంచాయతీలలో 87 అభివృద్ధి పనులును రూ.9.83 కోట్లు మంజూరు కాగా నేటి వరకు బిల్లులు చెల్లించినవి రూ.12.89 లక్షల మాత్రమే, 51 పనులు పూర్తికాగా, 33 పనులు వివిధ దశల లో ఉన్నట్లు మండల ఇంజనీరింగ్ అధికారి రమేష్ తెలిపారు. ఎం బుక్ రికార్డ్ అయిన వాటికి 2.95కోట్లు రూపాయలు బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. రోడ్డు పనులు పూర్తి చేసిన తెలుగు తమ్ముళ్లు బిల్లులు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోతే గ్రామాల్లో అభివృద్ధి పనులు ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

వేట లేక పూట గడవక..

●ఏడాదిగా కొనసాగుతున్న నిషేధం ●లీజు సొమ్ము చెల్లించలేదని మత్స్యశాఖ చర్యలు ● హైకోర్టు ఆదేశాలు బేఖాతరు


వేట లేకపోవడంతో ఒడ్డుకు చేరిన పడవలు

ప్రజాశక్తి- వంగర

తమ భూములు సైతం మడ్డువలస ప్రాజెక్టుకు అంకితం చేసి తమ పొట్ట పోషణ కోసం మడ్డువలస ప్రాజెక్టులో చేపల వేట చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్న మత్స్యకారులను మత్స్యకార సొసైటీ నుంచి లీజు సొమ్ము చెల్లించలేదనే నెపంతో అధికారులు వేటకు వెళ్ళనీయకుండా నిషేధాజ్ఞలు విధించారు. దీంతో ఏడాదిగా వేట లేక పూట గడవక వివిధ గ్రామాలలో ఉన్న మత్స్యకారులు వలస బాట పడుతున్నారు. కొట్టేశ శ్రీ సీతారామ మత్స్యకార సొసైటీ సంఘం కాలపరిమితి ముగియడంతో ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఆ దిశగా మత్స్యకార శాఖ అధికారులు చర్యలు చేపట్టలేదు. ఎన్నికలు నిర్వహించి కొత్త అధ్యక్షులు, కొత్త కమిటీ సభ్యులు వస్తే లీజు చెల్లించి తిరిగి వేటకు వెళ్లవచ్చునని మత్స్యకారులు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని వంగర మండలంలో గల మత్స్యకార సొసైటీ ఎన్నికలు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

మండలంలోని 15 గ్రామాల్లోని ఎస్సి, ఎస్టి, బిసి పేద కుటుంబాలకు చెందిన 574 మంది మత్స్యకారులు కొట్టేశ శ్రీసీతారామ మత్స్యకార సొసైటీగా ఏర్పడి గొర్లె శ్రీరాముల నాయుడు మడ్డువలస ప్రాజెక్టులో కొన్నేళ్లుగా చేపల వేట చేస్తూ తమ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా కూడా సొసైటీ ద్వారా ప్రభుత్వానికి కొంత లీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లీజు సొమ్ము వ్యవహారం, ప్రభుత్వం నుండి మత్స్యకారులకు అందించవలసిన రాయితీలు తదితర వ్యవహారాల్ల మత్స్యశాఖ అధికారులు బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుంది. గతంలో సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యత వహించిన సమయంలో సొసైటీ తరపున ప్రభుత్వానికి కట్టవలసిన సఫలీల లీజు సొమ్ము సుమారు రూ.57 లక్షల కట్టించుకోవలసిన మత్స్యశాఖ అధికారులు కూడా నిర్లక్ష్య ధోరణితో ఉండిపోవడంతో ఆ సొమ్ము సొసైటీ నుంచి ప్రభుత్వానికి చెల్లించలేదు. ఇంతలో మత్స్యకార సొసైటీ కాల పరిమితి కూడా ముగిసింది. దీంతో మత్స్యకారులు ఎవరూ కూడా ప్రాజెక్టులో చేపల వేట చేయకూడదని అధికారులు నిషేధాజ్ఞలు విధించారు. ప్రస్తుతం కూడా చేపల వేట చేయకుండా నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయి. అధికారులు కూడా మత్స్యకార సొసైటీని రద్దుచేసి చేపల వేట చేసేందుకు బహిరంగ వేలం వేసేందుకు ఇటీవల ప్రకటన కూడా చేశారు.

చాలామంది వలసలు వెళ్ళిపోతున్నారు

మేమంతా చాలా పేద కుటుంబాలకు చెందిన వాళ్ళం. మడ్డవలస ప్రాజెక్టులో చేపల వేట చేసుకుంటూ ఇన్నాళ్లు జీవనం సాగిస్తున్నాం. చేపల వేట చేయొద్దని నిషేధించడంతో కుటుంబాలతో రోడ్డును పడ్డాం. చాలామంది మత్స్యకారులు వలసలు వెళ్ళిపోతున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని వేట సాగించే విధంగా చర్యలు చేపట్టాలి.

సిగిరి నరసిం దొర, మత్స్యకారుడు సంగాం.

ఇబ్బందులు పడుతున్నాం

చేపల వేటలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. మత్స్యకారులకు జీవనోపాధికి ఆటంకం లేకుండా చూడాలి. ఎన్నికలు నిర్వహిస్తే కమిటీ ఏర్పడి లీజు సొమ్ము చెల్లించే అవకాశం ఉంటుంది. రహస్య ఓటింగ్ నిర్వహించాలి.

సూరిమల్లి శ్రీను, మత్స్యకారుడు, మగ్గూరు.

హైకోర్టును ఆశ్రయించిన మత్స్యకారులు

చేపల వేట చేసిన శ్రీసీతారామ మత్స్యకార సొసైటీని రద్దుచేసి ఇందులో చేపల వేట సాగించేందుకు ఓపెన్ ఆక్షన్ వేసేందుకు అధికారులు ప్రకటన చేసిన విషయాన్ని తెలుసుకున్న కొంతమంది మత్స్యకారులు హైకోర్టుని ఆశ్రయించారు. దీంతో ఇక్కడ గతంలో ఉన్న సొసైటీకి ఎన్నికలు నిర్వహించి కమిటీని నియమించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్ను కూడా మత్స్యకారులు ఇటీవల కలిసి తమ గోడును తెలియజేశారు. ఇప్పటికైనా మత్స్యశాఖ అధికారులు జోక్యం చేసుకొని ఎన్నికలు నిర్వహించి చేపల వేట నిషేధాజ్ఞలు ఎత్తివేసి మత్స్యకారులను ఆదుకోవాలని కోరుతున్నారు.

చర్యలు చేపడతాం

ఈ నెల 19న మత్స్యకారులు అందరితో మాట్లాడేందుకు జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశాం. ఈ సమావేశంలో ఎన్నికలు నిర్వహిస్తే బ్యాలెట్ ఓటింగ్ పెట్టాలని మత్స్యకారులు కోరారు. రహస్య ఓటింగ్ నిర్వహించాలంటే ముందుగా లక్ష రూపాయలు డిపాజిట్ చేయవలసి ఉంటుంది. మత్స్యకారుల సమస్యలపై ఉన్నతాధికారులకు నివేధించి వేటపై ఆలోచన చేస్తాం.

సిహెచ్ వివి ప్రసాద్ మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ రాజాం.

కోర్టు భవనాలకు నిధులు ఇవ్వండి

హైకోర్టు న్యాయమూర్తిని కోరిన శృంగవరపుకోట న్యాయవాదులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

శృంగవరపుకోటలో శిథిలమైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాల నిర్మాణానికి త్వరితగతిన నిధులు మంజూరు చేయించాలని హైకోర్టు న్యాయమూర్తి, విజయనగరం ప్రోటోకాల్ జడ్జి చీమలపాటి రవిని ఎస్.కోట న్యాయవాదులు శనివారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి రవి మాట్లాడుతూ ఎస్.కోట కోర్టు భవనాల కోసం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ద్వారా ఆర్ అండ్ బి పంపిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు విడుదల చేయించేందుకు ప్రయత్నాలు జరుపుతున్నారన్నారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసుల సంఖ్య, కోర్టులకు అవసరమైన జడ్జీల ఖాళీలను దృష్టిలో పెట్టుకుని కొత్తగా జూనియర్ సివిల్ జడ్జీల నియామకాలు చేపట్టేందుకు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ఎస్.కోట, పార్వతీపురం, బొబ్బిలి, కొత్తవలస తదితర కోర్టుల న్యాయవాదుల సమక్షంలో హైకోర్టు న్యాయమూర్తి రవి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా గల అన్ని రకాల కోర్టుల్లో అవసరమైన ఏసీలు, ఫర్నిచర్ ఏర్పాటు చేశామని, కోర్టుల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర హైకోర్టు కమిటీ ఎప్పటికప్పుడు సమావేశమై చర్చిస్తున్న విషయాన్ని కూడా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు జి.సూరిదేముడు, కార్యదర్శి బీవీఎస్ రామారావు, ట్రెజరర్ బి.త్రిమూర్తులు, న్యాయవాదులు డబ్ల్యుఎన్ శర్మ, బి.సత్యనారాయణ, బడబళ్ల రామకృష్ణ, రావాడ సత్యనారాయణ, బొడ్డు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


హైకోర్టు న్యాయమూర్తిని రవిని కలిసిన న్యాయవాదులు

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల


మాట్లాడుతున్న రామారావు

జ్యూట్ యాజమాన్యం కార్మిక శాఖ అధికార్ల వద్ద చేసుకున్న ఒప్పందం ప్రకారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మిల్లు తెరిచే క్రమంలో ఫిబ్రవరిలో కార్మిక శాఖ అధికార్ల వద్ద చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం కార్మిక సమస్యలను పరిష్కరించాల్సి ఉన్నా మిల్లు తిరిగి 4 నెలలు గడుస్తున్నా జ్యూట్ యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరించ కపోవడం దుర్మార్గమన్నారు. ముఖ్యంగా మిల్లు రన్నింగ్లో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన యాజమాన్యం మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు వసూలు చేసిన డెత్ ఫండ్ ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ ప్రభుత్వ బకాయిలు కూడా చెల్లిస్తామని చెప్పిన యాజమాన్యం ఇంతవరకు చెల్లించలేదని దీని ఫలితంగా కార్మికులు ఇబ్బందులు పడి పింఛన్, ఈఎస్ఐ సౌకర్యం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా అగ్రిమెంట్లో భాగంగా 2016 నుంచి రిటైర్డ్ కార్మికులకు గ్రాడ్యూటీ బకాయిలు చెల్లిస్తానని చెప్పిన యాజమాన్యం వాటిని కూడా ఇంతవరకు చెల్లించలేదన్నారు. జ్యూట్ యాజమాన్యం చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం ఈ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా కార్మిక హక్కుల రక్షణ కోసం జులై 9న జరిగే దేశ వ్యాపిత సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే జ్యూట్ యాజమాన్యం పై కార్మికులతో తీవ్రమైన ఉద్యమం చెప్పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

యోగాకు రూ. 400 కోట్లు అవసరమా?

ప్రజాశక్తి - చీపురుపల్లి

ఒక్క గంట యోగా కార్యక్రమానికి 400 కోట్ల రూపాయలు ఖర్చు అవసరమా అని వైసిపి జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల వరహాల నాయుడు, యువజన భాగం అధ్యక్షుడు శ్రీకృష్ణ అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్ బుక్కు రాజ్యాంగం నడుస్తుందని తెలుగుదేశం పార్టీలో రెడ్ బుక్కు సైకోలు ఎక్కువగా ఉన్నారని అన్నారు. జగన్మోహన్ రెడ్డికి ప్రజల నుండి వస్తున్న ఆదరణను చూసి కూటమి ప్రభుత్వం బెంబేలు ఎత్తిపోతుందన్నారు. జగన్మోహన్ రెడ్డికి వచ్చిన జన బలాన్ని చూసి తట్టుకోలేకే తమ నాయకుడిపై కూటమి ప్రభుత్వం, కూటమి నాయకులు ఏకమై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో మోసపూరిత పాలన జరుగుతోందని జగన్ హన్ రెడ్డి పై ఎన్ని కుట్రలు పన్నినా చంద్రబాబునాయుడు ఏమీ చేయలేడని అన్నారు. ఏడాదిలో 50 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు భృతి, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ ఇస్తామని చెప్పి యువతను మోసగించారన్నారు. ఏడాది కాలం వైసిపి నాయకులు వేచి చూశామని రాష్ట్రంలో ఏ ఒక్కరికి ఆమోదయోగ్యమైన పాలనను కూటమి ప్రభుత్వం అందించకపోవడంతో తాము ప్రజల పక్షాన నిలబడి పోరాటానికి సిద్ధమయ్యావని చెప్పారు. యోగా పేరుతో ఒక నెల నుండి పాఠశాలలో విద్యార్థులకు విద్య లేదని ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజలకు కనీస సేవలు కూడా అందడం లేదని దుయ్యాబట్టారు. ఇకనైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని సక్రమమైన పాలనను అందించాలని హితవు పలికారు.

రికవరీ వసూళ్ల వివరాలు బహిర్గతం చేయాలి

ప్రజాశక్తి - రామభద్రపురం


వెలుగు సీసీలతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మండలంలో డ్వాక్రా సంఘాలకు మంజూరు చేసిన స్త్రీ నిధి, ఉన్నతి వంటి రుణాల రికవరీలో అనేక ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయని వీటిపై వివరాలను బహిర్గతం చేయాలని టిడిపి నాయకులను వెలుగు సిబ్బందిని కోరారు. బుశాయవలస టిడిపి కార్యాలయంలో శనివారం జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు, మామిడి వలస ఎంపిటిసి మడక తిరుపతిరావు, రొంపల్లి ఎంపిటిసిలు బవిరెడ్డి శంకర్రావు వెలుగు సిబ్బందితో సమావేశమై వసూళ్ల వివరాలు బహిర్గతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు ఇచ్చిన మొత్తం ఎంత వడ్డీతో కలిపి ఎన్ని వాయిదాల్లో కట్టించుకోవాలి అనే వివరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాలా సంఘాల్లో నిరక్షరాస్యత కారణంగా అధికంగా వసూళ్లు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ మొత్తాల వసూళ్లకు గ్రామం అంతటికీ ఒకే అకౌంట్ నెంబర్ ఇవ్వడం, పాస్ బుక్ సౌకర్యం కల్పించకపోవడం వంటి కారణాలతో సభ్యులను తప్పు దారి పట్టించే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. గ్రామైక్య సంఘాల ఇష్టారాజ్యంగా విఒఎ, సిసి ఒక్కటై ఈ రుణాలు మంజూరు చేస్తున్నారని దీన్ని అలుసుగా తీసుకొని చాలా సంఘాల్లో అవినీతి రాజ్యమేలుతుందని అన్నారు. జిల్లా అధికార యంత్రాంగం చొరవ చూపి ఈ నిధుల విడుదల, వసూళ్ళ, అర్హులైన సభ్యులకు రుణాలు అందుతున్న పరిస్థితులపై సమీక్ష నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ సింగరాజు, బూసాయవలస సర్పంచ్ గంట సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కౌన్సిలింగ్

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 సంవత్సరానికి 5వ తరగతిలో మిగిలిన సీట్లుకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ఉమ్మడి జిల్లాల సమన్వయ అధికారి ఎస్.రూపావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసి సీట్లు రాని విద్యార్థులకు ఆదివారం బాలికలకు చీపురుపల్లి పాఠశాలలో, బాలురుకు 23వ తేదీ న కొప్పర్ల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినిలు ట్రాన్సఫర్ కావలిసిన వాళ్ళు కూడా హాజరు అవ్వాలని తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష రాసి సీట్లు రాని విద్యార్థినిలకు 26వ తేదీన నెల్లిమర్ల గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. బాలురుకు 27వ తేదీన కొప్పర్ల గురుకుల పాఠశాలలో కౌన్సలింగ్ జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినిలకు ట్రాన్సఫర్లు కావలిసిన వాళ్ళు కూడా హాజరు అవ్వాలని అమె తెలిపారు.

పట్టాలివ్వాలని గిరిజనుల నిరసన

ప్రజాశక్తి- మెంటాడ


పట్టాలివ్వాలని నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఆగూరు రెవెన్యూ సర్వే నెంబర్ 239, 240, 241, 242లో తాతముత్తాతల నుంచి గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని సంగం గుడ్డివలసలో శనివారం సిడగం చిన్నయ్య అధ్యక్షతన ఐదు గిరిజన గ్రామాలకు చెందిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ సాగులో లేని ధనికులు బండారు సంజీవరావు తదితరులకు పట్టాలిచ్చి సాగు చేస్తున్న గిరిజన రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వారికిచ్చిన పట్టాలను రద్దు చేసి గిరిజనులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గేదెల పెదరాములు, సిడగం సన్యాసిరావు, కొనెపి లక్ష్మణ, కాకి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల, కొండవెలగాడ, సతివాడ, రామతీర్థం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో11కెవి వ్యసాయం కనెక్షన్ పనులు కొనసాగుతున్నందున ఆదివారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం డిఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల, సబ్ స్టేషన్ 33/11కెవి గుర్ల రూరల్ ఫీడర్, కొండవెలగాడ సబ్ స్టేషన్ పారసాం రూరల్ ఫీడర్, సతివాడ33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలో రామతీర్థం 11కెవి రూరల్ ఫీడర్, ఒమ్మి రూరల్ ఫీడర్ పరిధిలో వ్యవసాయ కనెక్షన్ నిర్మాణపనుల కొనసాగింపు, చెట్లు తొలగించడం, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం, గరికిపేట, కొండగుంపాం, పూతికపేట, మొయిద, పారసాం, గెద్దపేట, మధుపాడ, పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బొడ్డపేట, బుచ్చన్నపేట, ఒమ్మి, మాల్యాడ, వెంకన్నపాలెం, గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని చాలని ఆయన కోరారు.